క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

నందిగామటౌన్/జగ్గయ్యపేటఅర్బన్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. అన్నదాతలు పాడిపంటలు, సిరిసంపదలతో తలతూగాలని, ఈ పండుగ అందరి జీవితాల్లో కొత్తకాంతులు నింపాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు



నందిగామటౌన్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలుమంగా, పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదా సమేత శ్రీ రంగనాధ స్వామి వారి కళ్యాణాన్ని అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాశరం పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైఖానస సంప్రదాయం ప్రకారం ఆలయ ఆవరణలో ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన శేష వాహనం మండపంపై మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణలు, భక్తుల గోవింద నామాల నడుమ కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అదే విధంగా పట్టణంలోని సీతా రామాంజనేయస్వామి వారి ఆలయంలో గోదాదేవి, కృష్ణమూర్తి దివ్య కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

19న గిరిజన ప్రజా సమాఖ్య సమ్మేళనం



జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 19వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న గిరిజన ప్రజా సమాఖ్య సమ్మేళనానికి గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని గిరిజన సంఘం జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లాహోరి బద్దూనాయక్, లావుడ్యా చిట్టిబాబు కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఏర్పాటు చేసిన గిరిజన ప్రజా సమాఖ్య సమ్మేళనం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించే గిరిజన ప్రజా సమాఖ్య సమ్మేళనానికి జగ్గయ్యపేట చుట్టుప్రక్కల ఉన్న లంబాడి తండాల నుంచి భారీసంఖ్యలో గిరిజనులు తరలివచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం ప్రతినిధులు భాగ్య నాయక్, శ్రీనివాసరావు నాయక్, శ్రీరాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన



వీరులపాడు: పెంచిన విద్యుత్ చార్జీలతో సామాన్య, పేద వర్గాల ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఎం నాయకులు వీరులపాడు మండలంలోని జుజ్జూరులో సోమవారం నిర్వహించిన భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెంచిన విద్యుత్‌చార్జీలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు చాట్ల రవి, పల్లెకంటి బాబు, గుంజి వీరయ్య, శ్రీనివాసరావు, సుందర్‌రావు, లాల్ అహ్మద్ గౌస్ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: విద్యుత్ బిల్లులపెంపును నిరసిస్తూ సీపీఎం నాయకులు స్థానిక పాత సినిమా హాల్ సెంటర్‌లో సోమవారం భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి వల్లభదాసు గురవయ్య, నాయకులు దారా నాగేశ్వరరావు, ధనమ్మ, రామారావు, సుధాకర్, తురక కొండలు పాల్గొన్నారు.



జోరుగా కోడి పందేలు

- రూ. లక్షల్లో చేతులు మారిన వైనం
- ఆవైపు కన్నెత్తి చూడని పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులు

జగ్గయ్యపేట: సంక్రాంతి నేపథ్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో అధికార కూటమి నాయకులు బరి తెగించారు. తమ అనుచరుల ద్వారా సంప్రదాయం పేరుతో యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. దీంతో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు మౌనంగా ఉండటంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో భోగిపండుగ రోజున కోడిపందేలు భారీస్థాయిలో నిర్వహించారు. పందేలకు పెట్టింది పేరుగా ఉండే గోదావరి జిల్లాలను తలపించేలా జగ్గయ్యపేట నియోజకవర్గంలో కోడిపందేలు, గుండాల, పేకాట జోరుగా సాగడం గమనార్హం. దీంతో నిన్నమొన్నటి వరకు కోడి పందేలు నిషేధమంటూ హెచ్చరికలు జారీచేసిన పోలీసు అధికారులు సైతం పండగరోజున జోరుగా కోడిపందేలు సాగుతున్నప్పటికీ పత్తాలేకుండా పోవడంతో బరుల నిర్వాహకులకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది.

మామిడితోటల్లో బరులు..

జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని మామిడి తోటలు, వెంచర్లలో టెంట్‌లు వేసి యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. నియోజకవర్గంలోని అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్ పేట, తొర్రకుంటపాలెం, శాంతి నగర్, మంగొల్లు, లింగాల, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నవాబుపేట గ్రామాల్లో కోడి పందేలను నిర్వహించారు. పందేల నిర్వాహకులు బరుల వద్ద సకల వసతులు ఏర్పాటు చేశారు. అధికార పార్టీ నాయకులు ఆయా బరులను స్వయంగా పర్యవేక్షించడం గమనార్హం. దీంతో గ్రామాలలో కోడి పందాల నిర్వహణ ప్రాంతాలు తిరునాళ్ల వాతావరణాన్ని తలపించాయి. దుకాణాలు, హోటళ్లు, ఐస్‌క్రీం పార్లర్‌ల తోపాటు మద్యం బెల్టు దుకాణాలు కూడా వెలిశాయి. బరుల వద్ద మద్యం ఏరులై పారింది. పందేలను తిలకించేందుకు తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో తరలిరాగా, అర్ధరాత్రి వరకు పందేలు సాగాయి. దీంతో లక్షలాది రూపాయలు చేతులు మారగా, పందెంరాయుళ్ల జేబులకు భారీగా చిల్లు పడింది. పోటీల్లో రాజకీయ నాయకులు, వ్యాపారులు, ఉద్యోగులు విరివిగా పాల్గొని పందేలు కాశారు.

తెలంగాణ, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు కోడిపందేలు వేసేందుకు జగ్గయ్యపేట పట్టణంలోని లాడ్జీలలో రూమ్‌లు సైతం అద్దెకు తీసుకున్నట్లు సమాచారం.



జగ్గయ్యపేట మండలం తొర్రకుంటపాలెంలో యథేచ్ఛగా సాగుతున్న కోడి పందేలు

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: పోలీస్, రెవిన్యూ అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినప్పటికీ కోడిపందేలు, జూదాల నిర్వహణను కూటమి నాయకులు యథేచ్ఛగా కొనసాగించారు. మండలంలోని పెనుగంచిప్రోలు, నవాబుపేటలో కోడి పందేలు పెద్దఎత్తున నిర్వహించారు. పందేల్లో భారీ స్థాయిలో నగదు చేతులు మారింది. బరుల వద్ద గుండాట, కోతముక్క, ఇతర జూదాలు నిర్వహించారు. మునుపెన్నడూ లేని విధంగా పేకాటను సైతం విచ్చలవిడిగా నిర్వహించారు. కోడిపందేల కోసం వందలాది వాహనాల్లో జనం తరలిరావడంతో పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

సంప్రదాయం ముసుగులో జూదం

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా కొనసాగుతున్నాయి. కంచికచర్ల మండలం గండేపల్లి, కీసర, పరిటాల, చందర్లపాడులోని పలు గ్రామాలు, నందిగామ పట్టణంలోని మామిడి తోటల్లో కోడి పందేల నిర్వహణ కోసం బరులు ఏర్పాటు చేసి పెదద్ద ఎత్తున పందేలు నిర్వహించారు. సంక్రాంతి సంప్రదాయం ముసుగులో నిర్వహిస్తున్న కోడి పందేల వైపు పోలీసులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. కోడి పందేల తోపాటు పేకాట, గుండాట, నెంబర్లు ఆటలు యథేచ్ఛగా సాగాయి. భారీఎత్తున సాగిన ఈ పందేల కారణంగా నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయి.

టీడీపీ నేతల కనుసన్నల్లో కోడిపందేలు

- కన్నెత్తి చూడని పోలీసులు
- కనిపించని సాంకేతిక పరిజ్ఞానం

నందిగామటౌన్: కోడి పందేలకు అనుమతులు లేవు..కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..డ్రోన్ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కోడి పందేల బరులు గుర్తించి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం..ఇలా పండుగకు రెండు, మూడురోజుల వరకు పోలీసులు, రెవెన్యూ శాఖాధికారులు జారీచేసిన హెచ్చరికలు చివరికి ప్రకటనలకే పరిమితమయ్యాయి. తీరాచూస్తే పండుగ ముందు రోజు నుంచే భారీఎత్తున బరులు ఏర్పాటు చేసి టీడీపీ నేతల కనుసన్నల్లో జోరుగా పందేలు నిర్వహించారు. ఇంతజరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ శాఖల అధికారులెవ్వరూ బరుల ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. పోలీసుల హెచ్చరికలు చూసి సంక్రాంతి పండుగకు 'కోడి' గెలుస్తుందా..'ఖాకీ'గెలుస్తుందా అని ఆసక్తిగా చూసిన ప్రజలు ...చివరికి కూటమి కోడే గెలిచిందని బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

రూ.లక్షల్లో పందేలు..

నందిగామ పట్టణంతోపాటు చందర్లపాడు మండలంలోని ఆయా గ్రామాల్లోని మామిడి తోటలు, ఖాళీ ప్రదేశాలలో నిర్వాహకులు కోడి పందేలు నిర్వహించారు. అంతేకాకుండా గుండాట, నంబరు ఆట, రింగు ఆట, పేకాట సైతం యథేచ్ఛగా నిర్వహించారు. ఈ పందేలలో సోమవారం ఒక్కరోజే రూ.లక్షలు చేతులు మారినట్లు సమాచారం. అంతే కాకుండా కోడి పందాల బరుల వద్ద బిర్యానీ, మద్యం, శీతల పానియాలు, అల్పాహారం, తదితర స్టాల్స్ ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లడ్‌లైట్లు, సౌండ్ సిస్టం, సకల వసతులు కల్పించడంతో జూదప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దఎత్తున పందేలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో పందేలను తిలకించేందుకు ప్రజలు తరలివెళ్లారు.



నందిగామ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేలు

టెక్నాలజీ ఎటు పోయింది?..

కోడి పందేలు, జూదం, తదితర అసాంఘీక క్రీడలను నిర్వహిస్తున్నా పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖాధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు చెప్పిన టెక్నాలజీ, సాంకేతిక పరిజ్ఞానం ఎటుపోయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. టీడీపీ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల ఆశీస్సులతోనే పందేలు నిర్వహిస్తుండటంతో పోలీసులు సైతం చేసేదేమిలేక మిన్నకుండిపోయారని గుసగుసలు వినిపిస్తుండటం గమనార్హం.



పెనుగంచిప్రోలులో నిర్వహిస్తున్న కోడిపందేలు



పెనుగంచిప్రోలులో సాగుతున్న నంబర్లాట



గండేపల్లిలో మామిడి తోటలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరి వద్ద పందెం రాయుళ్లు

ఘనంగా భోగి వేడుకలు

జగ్గయ్యపేట: భోగిపండుగను జగ్గయ్యపేట మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే కుటుంబసభ్యులు భోగి మంటలు వేసి సరదాగా గడిపారు. మహిళలు అందమైన రంగవల్లులు దిద్ది గొబ్బెలమ్మలను పెట్టి పూజలు చేశారు. మండలంలోని చిల్లకల్లులోని రామస్వామి రాజ నగర్, వేదాద్రి, రావిరాల, బలుసుపాడు గురుధాంలో భోగి మంటలు వేశారు. తాత్వికుడు గెంటేల వెంకట రమణ దంపతులు చిన్నారులకు భోగిపండ్లు పోశారు. పట్టణంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద చిన్నారులు భోగి మంటలు వేశారు. షేర్‌మహ్మద్‌పేటలో ఐద్వా ఆధ్వర్యంలో చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్- సంక్రాంతి వేడుకలలో భాగంగా సోమవారం భోగి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే చిన్నా, పెద్దా, మహిళలు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరు సందడి వాతావరణంలో భోగి మంటలు వేశారు. తలంటుస్నానమాచరించి ఆయా ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. మహిళలు ఇళ్ల ముంగిళ్లలో ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. ఆయా ఆలయాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖాధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ముక్కోటి మహా మండపంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. విజయవాడ శ్రేష్ఠ మ్యూజిక్ అకాడమీ చిన్నారులచే నిర్వహించిన భక్తి రంజని, నవ్వుల సందడి కార్టూన్ ప్రదర్శన, హరికథా గానం అందరినీ అలరించాయి.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: భోగి పండుగను వత్సవాయి మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే ఆయా గ్రామాల్లోని ప్రజలు ఇళ్లలోని కట్టెలతో భోగి మంటలు వేశారు. యువకులు గ్రూపుగా ఏర్పడి భోగిమంటలను వేసి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిళ్లను అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండల ప్రజలు భోగి పండుగ సంబరాలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఇళ్ల ముందు, వీధుల్లో ఆకర్షణీయంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. నాలుగు కూడళ్లల్లో భోగి మంటలు వేసి పాత వస్తువులు తగులబెట్టారు. ఒకరికొకరు భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వీరులపాడు: మండల ప్రజలు భోగి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిళ్లను పలురకాల రంగవల్లులతో అలంకరించి గొబ్బెలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం, భోగి పండుగ సందర్భంగా గ్రామాలలోని ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా జగ్గయ్యపేట ప్రజలు సోమవారం భోగిపండుగను ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే లేచి భోగిమంటలు చేశారు. మహిళలు రంగు రంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. వీధుల్లో హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు దర్శనమిచ్చాయి. చిన్నారులు ఆనందంతో గాలిపటాలు ఎగురవేస్తూ ఉల్లాసంగా గడిపారు. పట్టణంలోని యర్రయ్యగారిబజారు, బ్రాహ్మణబజారు, కాకానినగర్‌లో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: భోగ భాగ్యాలు కలగాలని కోరుతూ మండల ప్రజలు భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే పలువురు యువతులు, చిన్నారులు కుటుంబ సభ్యులతో ఇళ్ల ముందు భోగిమంటలు వేశారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద సిబ్బంది భోగిమంటలు వేసి మంగళవాయిద్యాలు వినిపించారు. గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు సందడి చేశాయి.



షేర్‌మహ్మద్‌పేటలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న ఐద్వా నాయకులు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద భోగి మంటలు వేస్తున్న యువత, చిన్నారులు



గండేపల్లిలో ఇంటిముందు భోగి ముగ్గులు వేస్తున్న మహిళలు



నందిగామ శివాలయం సెంటరులో భోగి మంటలు వేస్తున్న స్థానికులు



నందిగామ: చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న మహిళలు



వత్సవాయి: భోగిమంటలు వేస్తున్న యువకులు, చిన్నారులు



శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద భోగి మంటలు వేస్తున్న సిబ్బంది, భక్తులు

వైభవంగా గోదాదేవి కళ్యాణం



గోదాదేవి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, సుధారాణి దంపతుల ఆధ్వర్యంలో రామానుజ గోష్ఠి వారి నేతృత్వంలో గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో తన్నీరు వియ్యంకులు, రేపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు దంపతులు, పట్టణ ప్రముఖులు, భక్తులు, పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం గోదాదేవి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణం నుంచి శాస్త్రోక్తంగా డప్పు వాయిద్యాలతో తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించారు. సంక్రాంతి పండుగలో భోగి రోజున కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకుడు తెలిపారు. కార్యక్రమంలో ఈవో సురేష్‌బాబు, ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

151 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

నందిగామటౌన్: మద్యం అక్రమ రవాణా సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామసమీపంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. గ్రామానికి చెందిన పుల్లారావు ద్విచక్రవాహనంలో 151 తెలంగాణ మద్యం సీసాలను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.





అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని జీవీజీ జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో పదోతరగతి (1991–92బ్యాచ్) చదువుకున్న పూర్వ విద్యార్థులంతా సోమవారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కుటుంబ సమేతంగా తరలివచ్చి ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కుశలప్రశ్నలు వేసుకొంటూ ఆనందంగా గడిపారు. పాఠశాలలో తాము చదువుకున్న తరగతి గదులను కలియతిరిగి ఆనాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

మినీ గోకులం షెడ్లు ప్రారంభం

నందిగామటౌన్: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, చెరువుకొమ్ముపాలెం, పెద్దవరం గ్రామాలలో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్లను సోమవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వీరంకి వీరాస్వామి, ఇంటూరి సీతయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ జీవో కాపీలు దహనం



ప్రభుత్వ జీవో కాపీలను దహనం చేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: రాజకీయ దురుద్దేశంతో పేపర్ల మీద పేరు మార్చవచ్చునేమోగానీ పేద ప్రజల గుండెల్లో ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్థానాన్ని మాత్రం ఎవ్వరూ మార్చలేరని తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. భోగిపండుగ నేపథ్యంలో జగనన్న కాలనీ పేరును మార్పుచేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలను సోమవారం భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా 33 లక్షల మంది పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గుర్తుచేశారు. జగనన్న కాలనీల పేరుతో లక్షలాది ఇళ్ల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషిచేసిందన్నారు. జగనన్న కాలనీల పేర్లు మార్చి పీఎంఏవై ఎన్టీఆర్‌నగర్ అని జీవో తీసుకురావడం తగదన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మండలపార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, బద్దూనాయక్, శామ్యూల్ కన్నమాల, బలుసుపాడు సర్పంచ్ సూరిబాబు, పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, బీఎస్ఎన్ఎల్ రామారావు, ఉపేందర్‌రెడ్డి, గోగుల వెంకయ్య, గంగోలు వినోద్ పాల్గొన్నారు.